సాక్షి
నిర్మల్
సోమవారం। 25। నవంబర్। 2024



దిమ్మదుర్తిలో బర్డ్ ఫెస్టివల్
దిమ్మదుర్తి అటవీరేంజ్ పరిధి తుర్కం, యెంగన్న చెరువుల వద్ద బర్డ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఇది హైటీకోస్ బృందం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంది. 8లో▸



బాసరలో సామూహిక వ్రతాలు
బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై వ్రతం ఆచరించారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.0 /14.0
ఆకాశం పాక్షికంగా, అప్పుడప్పుడు పూర్తిగా మేఘావృతమవుతుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి వేళ చలి తీవ్రత పెరుగుతుంది. వేకువజామున మంచు కురుస్తుంది.

పరేషాన్‌లో 'ప్రసూతి'

- ఎంసీహెచ్‌లో గైనకాలజిస్టుల కొరత
- తరచూ సంభవిస్తున్న శిశు మరణాలు
- దాడులతో దూరమవుతున్న వైద్యులు
- ఇబ్బందుల్లో గర్భిణులు, బాలింతలు

నిర్మల్: జిల్లాలో ఎప్పటి నుంచో ఉన్న ఏకైక ప్రసూతి ఆస్పత్రి ఇప్పటికీ పురిటినొప్పులు ఎదుర్కొంటూనే ఉంది. ఇక్కడికి వచ్చేదే ప్రసూతి కోసం. కానీ.. సంబంధిత గైనకాలజిస్టులు సరిపడా లేక గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. వివిధ కారణాలతో ఇటీవల పసికందులు మృతిచెందడం, సంబంధిత బంధువులు దాడులకు పాల్పడటంతో కంగారు పడుతున్న ఎస్‌ఆర్ (సీనియర్ రెసిడెంట్)లు తమ విధులు మానుకోవడం కలవరపెడుతోంది. నిర్మల్‌లోని మాతాశిశు సంక్షేమ ఆస్పత్రి (ఎంసీహెచ్) మెడికల్ కాలేజీ (డీఎంఈ) పరిధిలోకి రావడంతో ఇందులో ఉండటానికి సీనియర్ వైద్యులు ఇష్టపడటం లేదు. పోస్టుల ప్రకారం వైద్యులు లేక, సేవలందించే ఎస్‌ఆర్‌లూ వెళ్లిపోవడంతో ఇక్కడ ఉన్నవారిపైనే భారం పడుతోంది. దీంతో ప్రసూతి సేవలపై ప్రభావం చూపుతోంది.

వందల్లో ప్రసవాలు
కడెం నుంచి బాసర వరకు జిల్లాలోని అన్ని మండలాలతో పాటు పక్కనున్న ఆదిలాబాద్‌లోని బోథ్, నేరడిగొండ ప్రాంతాల నుంచీ గర్భిణులు నిర్మల్ ప్రసూతి ఆస్పత్రికి వస్తుంటారు. ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టడంతో ఆశ కార్యకర్తలు ప్రతీ గ్రామం నుంచి గర్భిణులను ఇక్కడికే తీసుకువచ్చి డెలివరీ చేయిస్తున్నారు. ఈక్రమంలో ఇక్కడ నెలకు 250నుంచి 350వరకు ప్రసవాలు అవుతున్నాయి. సగటున రోజుకు 10పైనే ప్రసవాలు చేయాల్సి వస్తోంది. ఒక్కోసారి 15నుంచి 20వరకు చేసిన సందర్భాలున్నాయి.

ఇక్కడున్నది కొందరే..
ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పరిధిలోని మాతాశిశు ఆరోగ్యకేంద్రంలో 12మంది గైనకాలజిస్ట్‌లు ఉండాలి. అందులో ఒకరు హెచ్‌వోడీ, ఇద్దరు ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్‌లు, మిగతా వారు అసోసియేట్ ప్రొఫెసర్లు ఉండాలి. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడి నుంచి చాలామంది వైద్యులు వెళ్లిపోయారు. మెడికల్ కళాశాల (డీఎంఈ) పరిధిలోకి రావడానికి చాలామంది వైద్యులు విముఖత చూపుతున్నారు. ప్రస్తుతం ప్రసూతి ఆస్పత్రిలో రెగ్యులర్ ఒకరు, కాంట్రాక్ట్ ప్రాతిపదికన ముగ్గురు వైద్యులు మాత్రమే ఉన్నారు.

ఇబ్బందుల్లో గర్భిణులు
ఆస్పత్రికి వస్తున్న గర్భిణులకు సరిపడా వైద్యులు లేక ఉన్నవారిపైనే పనిభారం పడుతోంది. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రొఫెసర్ ఒక్కోసారి ఇదే ఆస్పత్రిలోనే మెడికోలకు క్లాసులు తీసుకోవాల్సి వస్తోంది. ఉన్న ముగ్గురు నలుగురు వైద్యుల్లో ఒకరు ఓపీలో, మరొకరు డెలివరీల్లో ఉండటంతో గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ఈ నేపథ్యంలో పాలకులు, సంబంధిత అధికారులు ఎంసీహెచ్‌లో ప్రసూతి సేవలపై దృష్టిపెట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.



జిల్లాకేంద్రంలోని మాతాశిశుసంక్షేమ ఆస్పత్రి

వైద్యుల విముఖత

మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ముందు ప్రసూతి ఆస్పత్రి తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో ఉండేది. దీని పరిధిలో ఏళ్లపాటు సీనియారిటీ కలిగిన వైద్యులుండేవారు. మెడికల్ కాలేజీ ఏర్పాటైన తర్వాత జిల్లా ప్రధాన ఆస్పత్రి, దాని పరిధిలోని ప్రసూతి ఆస్పత్రి కూడా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోకి వెళ్లాయి. అప్పటికే టీవీవీపీ పరిధిలో ఉన్న వైద్యులు డీఎంఈ పరిధిలోకి రావాలంటే సర్వీస్ లాస్ అవుతుండటంతో వారంతా ఇక్కడ ఉండటానికి విముఖత చూపించారు. దీంతో సీనియర్ వైద్యులంతా భైంసా, ఖానాపూర్, నర్సాపూర్ ఆస్పత్రులు, ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. ఈక్రమంలో స్థానిక ఆస్పత్రుల్లో వైద్యుల కొరత ఏర్పడింది. ఎంసీహెచ్‌లోనూ ప్రస్తుతం ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ ఇటీవల జరుగుతున్న పలు ఘటనలు వాటిపై సంబంధీకులు స్పందించిన తీరుపైనా జూనియర్ వైద్యులు కంగారు పడుతున్నారు. ఇటీవల జరిగిన ఘటన నేపథ్యంలో ఇక్కడ తమకు రక్షణ లేదంటూ తాజాగా ముగ్గురు సీనియర్ రెసిడెంట్ (ఎస్ఆర్)లు వెళ్లిపోవడం గమనార్హం.

ఎంసీహెచ్‌లో ప్రసవాల వివరాలు

నెల	సిజేరియన్	సాధారణ	మొత్తం
జనవరి	234	105	339
ఫిబ్రవరి	166	87	253
మార్చి	180	119	299
ఏప్రిల్	175	108	283
మే	181	102	283
జూన్	178	76	254
జూలై	218	96	314
ఆగస్టు	257	96	353
సెప్టెంబర్	231	90	321
అక్టోబర్	263	94	357

తగిన సేవలందిస్తున్నాం

జిల్లాకేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రికి గర్భిణులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. వారికి తగిన వైద్యసేవలు అందిస్తున్నాం. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అయితే మరింత మెరుగ్గా సేవలందించే వీలుంటుంది.
– డాక్టర్ సరోజ, ప్రసూతి ఆస్పత్రి హెచ్‌వోడీ

న్యూస్‌రీల్

జాతీయోత్సవంలో జిల్లా కవి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో ప్రముఖులతో రాంనరేశ్

నిర్మల్‌ఖిల్లా: ఈ నెల 21నుంచి హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న లోకమంథన్ జాతీయోత్సవంలో భాగంగా శనివారం రాత్రి జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి రాంనరేశ్ రచించిన 'వినురా భారతీయ వీర చరిత' పుస్తకాన్ని ఆవిష్కరించారు. జాగృతి జాతీయ వారపత్రిక ఎడిటర్ గోపరాజు నారాయణరావు, రాష్ట్రీయ కళామంచ్ నిర్వాహకుడు అప్పాల ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్, ఎమెస్కో పబ్లిషర్ వళీశ్వర్ పాల్గొన్నారు. తెలుగుభాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో ఆటవెలది పద్యరూపంలో చరిత్రను గ్రంథీకరించడం అభినందనీయమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. అనంతరం రచయిత రాంనరేశ్‌ను సన్మానించారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



భైంసాటౌన్: పరీక్షాకేంద్రం వద్ద పద్మ, సుభాష్

నిర్మల్ రూరల్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో–2, భైంసాలో–2, ఖానాపూర్‌లో–1 చొప్పున ఐదు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 925 మంది విద్యార్థులకు 913 మంది హాజరుకాగా 12 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని జుమ్మేరాత్‌పేట్ పాఠశాలలోని పరీక్షాకేంద్రాన్ని జిల్లా విద్యాధికారి రామారావు పరిశీలించారు.

భైంసాలో తనిఖీ చేసిన ఏసీజీఈ
భైంసాటౌన్: పట్టణంలోని మదీనాకాలనీలో గల జెడ్పీ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించగా పరీక్షాకేంద్రాన్ని ఏసీజీఈ పద్మ పరిశీలించారు. పట్టణంలోని రెండు పరీక్షాకేంద్రాల్లో 349 మంది విద్యార్థులకు 344 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఆమె వెంట ఎంఈవో సుభాష్, హెచ్‌ఎం గంగాప్రసాద్, సీఎస్ రాజశేఖర్ ఉన్నారు.


డీఈవోకు సన్మానం



డీఈవోను సన్మానిస్తున్న వేదిక సభ్యులు

నిర్మల్ రూరల్: జిల్లాకు నూతనంగా వచ్చిన డీఈవో రామారావును ఆదివారం జిల్లా జనవిజ్ఞాన వేదిక సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. జనవిజ్ఞాన వేదిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో మూఢనమ్మకాలను తొలగిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా సభ్యులను అభినందించారు. వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకం గంగాధర్, షేక్ రఫీక్, జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, చెకుముకి కన్వీనర్ నారాయణవర్మ, దేవేందర్, షేక్ నబీ, ఫయాజ్ తదితరులున్నారు.

26న జిల్లాకేంద్రంలో నిరసన కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: కేంద్రం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిరసనలు చేపట్టనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, నాయకులు గోనె స్వామి, గుట్ల ప్రసాద్ తదితరులున్నారు.

సమీకృత గురుకులం వచ్చేనా?

- రెండువిడతల్లో జిల్లాకు మొండిచేయి
- మలివిడతలోనైనా మంజూరయ్యేనా?



భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకులాలన్నీ కలిపి ఒకే ప్రాంగణంలో నియోజకవర్గానికో యంగ్ ఇండియా సమీకృత గురుకులం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్ మినహా వంద నియోజకవర్గాల్లో వీటిని నిర్మించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా మొదటి విడతలో 28, రెండో విడతలో 26 నియోజకవర్గాలకు గురుకులాలను మంజూరు చేసింది. మొదటివిడతలో మంచిర్యాల జిల్లాకు ఒకటి, రెండోవిడతలో పక్కనే ఉన్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు నాలుగు సమీకృత గురుకులాలు రాగా, ఈ రెండు విడతల్లోనూ జిల్లాకు చోటు దక్కలేదు. జిల్లా విద్యాశాఖ నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం ప్రతిపాదనలు కోరలేదని అధికారులు చెబుతున్నారు. మలి విడతల్లో మంజూరయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు. దీంతో సమీకృత గురుకులాలు ఏర్పాటైతే జిల్లాలోని అన్ని గురుకులాలు ఒకే ప్రాంగణంలోకి రానున్నాయి. తద్వారా విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాలో ఇలా..
జిల్లాలో ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కస్తూర్బా, మోడల్, సోషల్ వెల్ఫేర్, ట్రైబర్ వెల్ఫేర్ అన్నీ కలిపి 56 గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉండగా, వీటిలో 21,111 మంది విద్యార్థులు చదువుతున్నారు. కొన్నింటిలో ఒకటి నుంచి, మరికొన్నింటిలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యనందిస్తున్నారు. చాలావాటికి సొంత భవనాలు లేక అరకొర వసతుల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక, ప్రభుత్వం కూడా అద్దె భవనాలకు ఏటా రూ.కోట్లలో వెచ్చించాల్సి వస్తోంది. దీనికితోడు ఆయా గురుకులాల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలతో పూర్తిస్థాయిలో విద్య అందడం లేదు. ఈ నేపథ్యంలో 20–25 ఎకరాల సువిశాల స్థలాల్లో సమీకృత గురుకుల పాఠశాలలు ఏర్పాటైతే విద్యార్థులకు వసతుల లేమి తొలగడంతోపాటు పూర్తిస్థాయిలో మెరుగైన విద్య అందనుంది.

జిల్లాలోని గురుకులాల వివరాలు

విద్యాసంస్థ	సంఖ్య	విద్యార్థులు
కేజీబీవీలు	18	5,960
అర్బన్ రెసిడెన్షియల్‌లు	1	107
టీఎస్ మోడల్ స్కూళ్లు	1	131
మైనారిటీ వెల్ఫేర్ స్కూళ్లు	5	2,089
ఎంజేపీ (బీసీ)లు	7	4,078
టీఎస్‌ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లు	5	3,200
టీఎస్‌టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లు	1	546
టీఎస్‌ఆర్‌ఈఐఎస్‌లు	1	643
టీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలు	17	4,357

ప్రతిపాదనలు కోరలేదు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర గురుకులాలన్నీ ఒకే చోట ఉండేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు 54 పాఠశాలలు మంజూరు చేసింది. జిల్లాలో ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రతిపాదనలు కోరలేదు. – రామారావు, డీఈవో

నేటితో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల దరఖాస్తు గడువు పూర్తి

నిర్మల్: జిల్లా వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 52 ఔట్‌సోర్సింగ్ పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ సోమవారంతో ముగుస్తుందని దుర్గం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకుడు దుర్గం శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలు www.nirmal.nic.in నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, సోమవారం సాయంత్రం 3గంటలకు వరకు స్థానిక మెడికల్ కాలేజీలో అందించాలని పేర్కొన్నారు. ల్యాబ్ అటెండెంట్–15, స్టోర్ కీపర్–1, డాటాఎంట్రీ ఆపరేటర్–2, స్టెనో–1, టైపిస్ట్–1, రికార్డ్‌అసిస్టెంట్–1, రికార్డు క్లర్క్–1, రేడియోగ్రఫీ టెక్నీషియన్–3, రేడియోగ్రఫీ టెక్నీషియన్ ఈసీజీ–2, రేడియోగ్రఫీ టెక్నీషియన్ సీటీస్కాన్–3, అనస్థీషియా టెక్నీషియన్–4, ధోబీ–4, ఎలక్ట్రీషియన్–2, ప్లంబర్–1, డ్రైవర్–1, థియేటర్ అసిస్టెంట్–4, గ్యాస్ ఆపరేటర్–2, వార్డు అటెండెంట్–4 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు 7842282218, 9948170670, 8074044154 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జిల్లా సందర్శనలో ట్రైనీ ఐఏఎస్‌లు



లక్ష్మణచాంద: వడ్లను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు



నిర్మల్ రూరల్: చిట్యాలలో రైతుతో మాట్లాడుతూ..

- ప్రభుత్వ పాఠశాలల పరిశీలన
- ప్రభుత్వ పథకాల గురించి ఆరా

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి (కే) గ్రామంలో ఆదివారం ట్రైనీ ఐఏఎస్ అధికారులు పర్యటించారు. ట్రైనీ అధికారుల్లో రవికాంత్ (ఐఎఫ్ఎస్), ప్రేక్షణ జైన్ (ఐడీఈఎస్), రాకేశ్ (ఐఆర్‌ఎస్), రితు సుందరం (ఐపీ టీఏఎఫ్‌ఎస్) తదితరులున్నారు. వీరికి ఎంపీడీవో రాధ స్వాగతం పలికారు. అనంతరం వీరు జనాభా, వసతులు, ప్రజలకు అందుతున్న వివిధ పథకాల గురించి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, పల్లె ప్రకృతివనం, నర్సరీలు, గోదాం, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని పరిశీలించి సాగు వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట ఎస్సై సుమలత, ఏపీవో ప్రమీల, ఏపీఎం వాణిశ్రీ, ఎంపీవో అమీర్‌ఖాన్, టీఏలు దినేశ్, భీమ్, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, హెచ్‌ఎం సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్ సునీత, ఎఫ్ఏ శ్రీనివాస్ తదితరులున్నారు.

నిర్మల్ రూరల్: మండలంలోని చిట్యాల, నీలాయిపేట గ్రామాలను ట్రైనీ ఐఏఎస్‌లు పరిశీలించారు. అధికారులతో సమావేశమై చేపట్టిన పనుల వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలు, శ్మశాన వాటికలు, చెక్‌డ్యామ్, నర్సరీలు, క్రీడాప్రాంగణం, పల్లెప్రకృతి వనం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగు వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో గజానన్, ఎంఈవో వెంకటేశ్వర్, ఐకేపీ ఏపీఎం బోసు, క్లస్టర్ సీసీలు నర్సయ్య, జ్యోతిర్మయి ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కేజీబీవీని ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. సౌకర్యాలు, బోధన తీరు గురించి ఎస్వో వీణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల సమావేశంలో సమస్యలపై చర్చించారు. 30 పడకల సామాజిక ఆస్పత్రిని సందర్శించి సేవల గురించి తెలుసుకున్నారు. వీరి వెంట ఎంపీడీవో పుష్పలత, డీటీ వాహీదొద్దీన్, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఆర్ఐ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ తదితరులున్నారు.

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, పీహెచ్‌సీని ట్రైనీ ఐఏఎస్‌లు పరిశీలించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన ఇంకుడుగుంతలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న ఆహార పదార్థాలు, మిషన్ భగీరథ, పల్లె ప్రకృతివనం, ప్రజాపంపిణీ వ్యవస్థ గురించి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయ భవనంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై బ్యాంక్ రుణాలు, ఉపయోగాల గురించి ఆరా తీశారు. వీరి వెంట ఎంపీడీవో సురేశ్, తహసీల్దార్ మల్లేశ్, గ్రామ ప్రత్యేకాధికారి రాజమల్లు, ఎంపీవో షేక్‌ఖలీల్ హైమద్, ఏపీవో మంజులారెడ్డి, ఐకేపీ ఏపీఎం గంగామణి, పంచాయతీ కార్యదర్శి అశోక్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

లక్ష్మణచాంద: విద్యార్థులకు నాణ్యతతో రుచి కరమైన భోజనం అందించాలని డీఈవో రామారావు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. పాఠశాల ఆవరణ, వంటశాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, నిత్యం స్టడీ హవర్ నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారి లింబాద్రి, ఎస్వో నవిత తదితరులున్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో రామారావు

డుమ్మాలకు చెక్

- డీఎడ్ కళాశాలల్లో 'ఫేషియల్' అటెండెన్స్
- ఛాత్రోపాధ్యాయులు, లెక్చరర్ల హాజరుపై ఎస్‌సీఈఆర్టీ ఫోకస్
- త్వరలోనే ఎఫ్ఆర్ఎస్ అమలు



ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డైట్ కళాశాల

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ విద్యను గాడిలో పెట్టేందుకు ఎస్‌సీఈఆర్టీ దృష్టి సారించింది. డీఎడ్ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)ను అమలులోకి తెచ్చింది. ప్రస్తుతం సర్కారు బడుల్లో విద్యార్థులకు ఈ విధానం అమలులో ఉంది. తాజాగా ప్రభుత్వ, ప్రైవేట్ డీఎడ్ కళాశాలల్లో అమలుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో అభ్యసించే కొంతమంది ఛాత్రోపాధ్యాయులు తరగతులకు ఎగనామం పెడుతున్నారు. వారు నేర్చుకుంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసే అవకాశం ఉంటుంది. అయితే చాలా కళాశాలల్లో తరగతులకు హాజరు కాకుండా యాజమాన్యాలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇందుకు డబ్బులు ముట్టజెబుతున్నారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఎస్‌సీఈఆర్టీ ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..
ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఏడు డీఎడ్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ డీఎడ్‌తో పాటు రెండు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ డైట్‌లో 300 మంది విద్యను అభ్యసిస్తున్నారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మీడియంలో కోర్సులు కొనసాగుతున్నాయి. అలాగే వివేకానంద, విద్యార్థి ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ఇక ఉట్నూర్‌లో ఫూలాజీబాబా, నిర్మల్‌లో పంచశీల్, భైంసాలో జీపీలడ్డా, ఆసిఫాబాద్‌లో శ్రీనిధి, మంచిర్యాలలో ఎస్ఆర్‌కేఎం డీఎడ్ కళాశాలలు కొనసాగుతున్నాయి. వీటిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కలిపి వంద చొప్పున 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తంగా 900 మంది విద్యార్థులు డీఎడ్ కోర్సు చేస్తున్నారు.

లెక్చరర్లు లేకుండానే..
ఉమ్మడి జిల్లా పరిధిలో చాలా కళాశాలల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకుండానే కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రిన్సిపాల్‌తో పాటు ఎనిమిది మంది లెక్చరర్లను నియమించుకోవాలి. అయితే ఒకరిద్దరితో విద్యాబోధన చేయించి మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో విద్యార్థులు స్వతహాగా చదువుకుని పరీక్షలు రాస్తున్నారే.. గాని వారు పూర్తిస్థాయిలో జ్ఞానం పొందలేకపోతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఛాత్రోపాధ్యాయులతో పాటు లెక్చరర్లకు ఫేషియల్ అటెండెన్స్ సిస్టమ్ అమలు చేయాలని నిర్ణయించారు.

తరగతులకు ఎగనామం..

ఈ కళాశాలల్లో ఆ జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ డైట్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని జిల్లాల్లో గల ఒకట్రెండు కళాశాలల్లో విద్యార్థులు ప్రతీరోజు వచ్చే విధంగా ఆ యాజమాన్యాలు కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా కాలేజీల్లో తరగతులకు గైర్హాజరైతే వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు సమాచారం. హాజరు వేసేందుకు రూ.20వేలు, రికార్డుల కోసం రూ.10వేలు, పరీక్షల సమయంలో మరో రూ.10వేల చొప్పున తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పాఠశాల మాదిరిగానే డీఎడ్ తరగతులు కొనసాగుతాయి. ప్రథమ సంవత్సరంలో 40 రోజులు, ద్వితీయ సంవత్సరంలో 60 రోజుల పాటు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు తరగతులు బోధించాల్సి ఉంటుంది. అలాగే బోధించిన విషయాలపై రికార్డులు రాయాలి. కానీ డబ్బులు ముట్టజెప్పిన వారికి కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నాయి. వార్షిక పరీక్షల సమయంలో కూడా డబ్బులు తీసుకుని పరీక్షలు రాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అమ్మవార్లకు ప్రత్యేకపూజలు





బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం వైదిక బృందం ఆధ్వర్యంలో మహాలక్ష్మీ, మహాకాళి, సరస్వతీ అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. గురుమదనానంద సరస్వతి పీఠాధిపతి అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక కుంకుమార్చన చేశారు. అంతకుముందు అర్చకులు, వేద పండితులు పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన పుష్కర ఘాట్ వద్ద విశేషపూజ, పుష్పార్చనలో పాల్గొని కార్తీక మాస వైభవం, విశిష్టతను భక్తులకు వివరించారు. గోదారమ్మ ఉత్సవమూర్తికి జ్యోతి ప్రజ్వలన చేసి సుహాసినులతో కార్తిక దీపోత్సవ హారతి ఇచ్చారు. అనంతరం పీఠాధిపతికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ ప్రాంగణంలో సరస్వతీ అమ్మవారి అలంకరణలో కార్తిక దీపాలు వెలిగించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బీట్ అధికారికి గాయాలు


గాయపడిన వెంకటేశ్

జన్నారం: విధి నిర్వహణలో సొంత బీట్‌కు వెళ్తున్న బీట్ అధికారి వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అటవీ అధికారులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్‌లో పనిచేస్తున్న వెంకటేశ్ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై జన్నారం నుంచి చింతగూడ వైపు వెళ్తుండగా చింతగూడ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే లక్సెట్టిపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

కడెం: మండలంలోని దత్తోజీపేట్ అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అల్లంపల్లికి చెందిన కస్తూరి రమేశ్ (26) ఈనెల 23న కూలీ పని కోసమని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా గంగాపూర్ జీపీ పరిధిలోని దత్తోజీపేట్ అటవీ ప్రాంతంలో మృతదేహం కనిపించింది. మృతిపై విచారణ చేపట్టాలని మృతుని భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్వర్టు పైనుంచి పడి ఒకరు..

కడెం: కల్వర్టుపై నిద్ర ఓ యువకుడిని కాటికి పంపింది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాసాయిపేట్‌కు చెందిన తీగల రమేశ్(33) కొన్నేళ్లుగా లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పల్లిలో ఉంటున్నాడు. తన మేనత్త మృతి చెందిందని ఇటీవలే మాసాయిపేట్‌కు వచ్చాడు. ఈనెల 23న రాత్రి అతిగా మద్యం సేవించి గ్రామ సమీపంలోని కల్వర్టుపై పడుకున్నాడు. అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య సుకన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రెయినేజీలో పడి ఒకరు..

ఇంద్రవెల్లి: ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై భీంరావ్ తెలిపిన వివరాల ప్రకారం దనోరా(బి) గ్రామానికి చెందిన కుంర సుభాష్ (48) ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకుంటుండగా ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. ఏఎస్సై కాత్లే భీంరావ్ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడు..

దహెగాం: ఐదేళ్లకే ఆ బాలుడికి నూరేళ్లు నిండాయి. ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. మండలంలోని దేవాజీగూడలో ఘటన చోటు చేసుకుంది. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దేవాజీగూడకు చెందిన సదువుల క్రిష్ణ, వనిత దంపతుల కుమారుడు రిషాన్ (5) ఆదివారం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన సదువుల శ్రీనివాస్ ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు ఆడుకుంటున్న బాలున్ని ట్రాక్టర్ కబళించడంతో అయ్యో రిషాన్ అంటూ అక్కడున్నవారు కన్నీటి పర్యంతమయ్యారు. బాలుని బాబాయ్ సదువుల ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన జైనథ్ మండల కేంద్రానికి చెందిన జవ్వాజి సురేందర్ (32) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి అఘాయిత్యానికి పాల్పడినట్లు వివరించారు.

‘దిమ్మదుర్తి’లో బర్డ్ ఫెస్టివల్


వడ్రంగి పిట్ట
కొంగ
కొంగజాతి పక్షి


చెరువు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

- అటవీ ప్రాంతంలో నేచర్ క్యాంపు
- సందడి చేసిన పర్యాటకులు..


అటవీప్రాంతంలోకి సఫారీకి వెళ్తున్న పర్యాటకులు


పక్షుల వివరాలను పర్యాటకులకు వివరిస్తున్న సీసీఎఫ్ అధికారి శరవణన్

మామడ(నిర్మల్): నిర్మల్ జిల్లా మామడ మండలంలోని దిమ్మదుర్తి అటవీ అటవీరేంజ్ పరిధిలో ఉన్న నల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కం చెరువు, పొన్కల్ గ్రామ పంచాయతీ పరిధిలోని యెంగన్న చెరువుల వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేచర్ క్యాంపు, బర్డ్ ఫెస్టివల్ కార్యక్రమాలు హైటీకోస్ బృందం పర్యాటకులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో వచ్చిన పర్యాటకులు శనివారం చెరువుల వద్దకు చేరుకోగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పర్యాటకులు కవ్వాల్ అభయారణ్యం, చెరువులను సందర్శించారు. రాత్రి సమయంలో క్యాంపుఫైర్ ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం తుర్కం చెరువు నుంచి యెంగన్న చెరువుకు ప్రత్యేక వాహనాలలో సఫారీ నిర్వహించారు. చెరువులకు వచ్చిన పక్షుల అందాలను కెమెరాలలో బందించారు. అటవీశాఖ అధికారులు పీసీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఏలుసింగ్ మేరు, సీసీఎఫ్ అధికారి శరవణన్, డీఎఫ్‌వో నాగినిభాను, ఎఫ్‌డీవో భవానిశంకర్, ఎఫ్ఆర్‌వోలు శ్రీనివాస్‌రావు, అవినాష్, రామకృష్ణ, అనిత వారికి చెరువుల ప్రాముఖ్యత, ఈ ప్రాంతంలోకి వలస వచ్చే పక్షుల గురించి వివరించారు.

సంతోషం కలిగించింది



అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల నేచర్ క్యాంపు కార్యక్రమం నాకు చాలా సంతోషం కలిగించింది. ఇక్కడ అటవీ ప్రాంతంలో ఉన్న చెరువుల పరిసరాలు, వైవిధ్యమైన పక్షులు ఆహ్లాదం పంచాయి.

– ఉషా, పర్యాటకురాలు, హైదరాబాద్

పరిసరాలు ఆకట్టుకున్నాయి



నేచర్‌క్యాంపు, బర్డ్ వాక్ కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వరంగల్ నుండి వచ్చా. ఇక్కడి చెరువుల పరిసరాలు ఆకట్టుకున్నాయి. పక్షులు నివసించేందుకు అనువైన వాతావరణం ఉంది. పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తే బాగుంటుంది.– రమేశ్, వైల్డ్‌లైఫ్ ఎన్‌జీవో సొసైటీ, వరంగల్

అవగాహన కల్పించారు



రెండు రోజుల నేచర్ క్యాంపు కార్యక్రమం చాలా ఆనందం కలిగించింది. చెరువు పరిసరాలు, పక్షులు, చెట్లరకాలపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఇక్కడి ప్రాంతం ప్రాముఖ్యతను ఇతరులకు కూడా తెలియజేస్తాం. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది.

– గుర్రం కిషోర్, పర్యాటకుడు, వరంగల్

పక్షులు పర్యావరణ మిత్రులు


మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో శివకుమార్

చెన్నూర్: పక్షులు పర్యావరణ మిత్రులని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివకుమార్ అన్నారు. రెండు రోజులుగా మంచిర్యాల రేంజ్ పరిధిలోని శివ్వారం వైల్డ్‌లైఫ్ సాంక్చురీ, గొల్లవాగు ప్రాజెక్ట్, చెన్నూర్ రేంజ్ పరిధిలోని అర్బన్ ఎకో పార్క్‌లో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం సభ్యులతో కలిసి పక్షులు, కీటకాలు, జీవరాసులపై సర్వే చేశారు. స్థానిక ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఆదివారం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. గోదావరి పరీవాహక ప్రాంతమైన మంచిర్యాల, చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి రేంజ్ ఆఫీసర్లు, సిబ్బందితో కలిసి పక్షులు, కీటకాలు, జీవరాసులపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. రెండు రోజుల సర్వేలో 150 రకాల పక్షులు, 30 రకాల సీతాకోక చిలుకలను గుర్తించామన్నారు. శీతాకాలంలో నది పరీవాహక ప్రాంతాలకు వివిధ రకాల పక్షులు, బట్టర్‌ఫ్లైలు వలస వస్తుంటాయని, వీటిని సంరక్షించుకోవాలన్నారు. అటవీ ప్రాంతాల్లో పులులు, అడవి జంతువులే కాకుండా ఎన్నో రకాల బర్డ్స్, బట్టర్‌ఫ్లైలు ఉంటాయన్నారు. అనంతరం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధి రాజశేఖర్ మాట్లాడుతూ ఉత్తర భారత దేశంలో పక్షులు గోదావరి తీర ప్రాంతాలలో 8 వేల కోట్ల విలువైన ఎరువులను విసర్జిస్తుందన్నారు. చెరువులు, కుంటలకు కొత్త రకం బాతులు, కొంగలు వలస వస్తుంటాయని, వాటి ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. పక్షులు, కీటకాలు వలస వస్తే ఈ ప్రాంతాల్లో వాటి సంతతి పెరుగుతుందన్నారు. మానవళి బర్డ్స్, బట్టర్‌ఫ్లైలకు హాని తలపెట్టవద్దని సూచించారు. సమావేశంలో నీల్వాయి, కోటపల్లి, మంచిర్యాల రేంజ్ ఆఫీసర్లు అప్పలకొండ, సదానందం, రత్నాకర్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రిసోర్స్ పర్సన్లు హర్ష, సోహన్, డీఎఫ్‌వో ప్రభాకర్ పాల్గొన్నారు.

యువకుడి చికిత్సకు చేయూత

సాక్షి ఎఫెక్ట్..


కిరణ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న రమేశ్

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన అమంద కిరణ్ కొంతకాలంగా కడుపు ఉబ్బరం, లివర్ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ విషయమై ఈ నెల 18న ‘సాక్షి’లో ‘దాతల సాయంకోసం ఎదురుచూపు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన దాతలు కరిపె రాజ్‌కుమార్, పాల మహేశ్, ఇరాక్ రాజు, గంగాధర్, వినోద్, సైబెవార్ ఆంజనేయులు, చంద్రవిలాస్, కాలేరి రమేశ్, సత్యనారాయణ రూ.15వేల వరకు ఫోన్‌పే ద్వారా సాయం అందించారు. ఆదివారం కాంగ్రెస్ నాయకుడు వేల్పుల రమేశ్ తన సొంత ఖర్చుతో వాహనాన్ని ఏర్పాటు చేసి ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించాడు. కాగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యాధికారులు పేర్కొన్నారు. దాతలు స్పందించి ఆదుకుంటే తప్ప కిరణ్ బతికే అవకాశం లేదని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

అన్ని పోటీల్లో పాల్గొనేలా చూస్తాం

- ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో చదివే విద్యార్థులను దేశవ్యాప్తంగా నిర్వహించే అన్ని పోటీలకు పంపిస్తామని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ పేర్కొన్నారు. ఆటోవన్– 24 పోటీల్లో రాణించిన విద్యార్థులను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనేలా చూస్తామని, అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు.

రెండోస్థానంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

హైదరాబాద్ బిట్స్‌పిలానిలో ఈనెల 22, 23 తేదీల్లో ఆటోవన్ 24 పోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రెండోస్థానంలో నిలిచారు. మెకానికల్, మెటలార్జికల్ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు పాల్గొని ‘మెటీరియల్స్ టెక్నాలజీ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్’ అనే పోస్టర్ ప్రదర్శించారు. విద్యార్థుల కృషిని గుర్తించిన అక్కడి న్యాయనిర్ణేతలు రెండోస్థానం కేటాయించారు. రూ.8వేల నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహించారు.

కొరమీనుకు కేరాఫ్‌గా మంచిర్యాల

- ఎల్లంపల్లి పాజెక్టు వద్ద సంరక్షణ, పెంపకం కేంద్రం
- 30 ఎకరాల్లో రూ. 15 కోట్లతో ఏర్పాటు
- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు


ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద కొరమీను సంరక్షణ కేంద్రం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పీఎస్సార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర చేప కొరమీను(కొర్రమట్ట, బొమ్మె)కు మంచిర్యాల జిల్లా కేరాఫ్‌గా మారుతుందని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి వద్ద కొరమీను సంరక్షణ, పెంపకం కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈమేరకు ప్రతిపాదిత స్థలాన్ని రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి స్థల పరిశీలన చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ భారీ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. 30 ఎకరాల్లో రూ.15 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కొరమీను జాతిని కాపాడటంతోపాటు సంఖ్యను గణనీయంగా పెంచుతూ రాష్ట్ర అవసరాలను తీర్చి ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఎగుమతి చేసేలా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ ఉత్పత్తయ్యే చేప పిల్లలను రాష్ట్ర వ్యాప్తంగా చేపల పంపిణీ పథకానికి ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. చేపల పెంపకం కోసం ఫిష్‌పాండ్‌లు ఏర్పాటు చేసుకుని ఉపాధితోపాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఎల్లంపల్లి వద్ద 85 ఎకరాల స్థలాన్ని మత్స్య శాఖకు అప్పగించగా, అందులో 30 ఎకరారు కొరమీను పెంపకం, సంరక్షణ ప్రాజెకు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మిగతా 55 ఎకరాల్లో అక్వా కల్చర్‌ఫాం కూడా ఏర్పాటు చేసి అన్ని రకాల చేపల పెంపకం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ వై.సాంబశివరావు, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, సర్వేయర్ ఆశిష్, ఆర్ఐ ప్రభు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, జిల్లా అధికార ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుప్తనిధుల ముఠా అరెస్టు



పెంచికల్‌పేట్: పోలీసుల అదుపులో ముఠా సభ్యులు

పెంచికల్‌పేట్: మండలంలోని లోడ్‌పల్లి బీట్ పరిధిలో సిద్ధేశ్వర గుట్టల్లో గుప్తనిధుల తవ్వకానికి వచ్చిన ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పెంచికల్‌పేట ఎఫ్ఆర్‌వో అనిల్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేయగా రెండు కార్లలో వచ్చిన ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. బొంబాయిగూడకు చెందిన వసంతరావు, కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్, వెంకన్న, సురేందర్, వెంకన్న, అంజన్న, రమేశ్‌పై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు. ఈ దాడుల్లో డీఆర్‌వో జమీల్ అహ్మద్, ఎఫ్ఎస్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీవో మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల తవ్వకాల కలకలం

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండలంలోని కన్నెపల్లిలో గుప్త నిధుల తవ్వకాలు ఘటన కలకలం రేపింది. కన్నెపల్లిలో పాడు బడిన ఇంటిలో ఆదివారం గుప్త నిధుల కోసం ఇంటి యజమానితో పాటు పలువురు తవ్వకాలు జరిపారు. సమాచారం అందుకున్న పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఒక ఆటో, పూజా సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. కొద్దిరోజులుగా ఈ ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

‘ఆటవెలదిలో అమెరికా’ పుస్తక పరిచయం


పుస్తక పరిచయం చేస్తున్న వామన్‌రావు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సాహితీ సంరక్షణ సమితి అలరించింది. కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌కు చెందిన సబ్బని లక్ష్మీనారాయణ రచించిన ఆటవెలదిలో అమెరికా అనే పుస్తకాన్ని సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు పరిచయం చేశారు. 2018లో తన అమెరికా అనుభవాలను పద్య కావ్యం ఆటవెలదిలో అమెరికా శతకాన్ని తన ప్రయాణ అనుభవాలను అమెరికా విశేషాలను, తెలుగువారి అప్యాయత, అదరించిన తీరు వర్ణించారన్నారు. నగలు నత్రలేవు వారి హృదయమున అంటూ వారి మనుసులను ఉదహరించారని తెలిపారు. వృత్తి అంగ్లోపన్యాసకుడిగా, ప్రవృత్తి సాహిత్య సేద్యం చేస్తూ లక్ష్మీనారాయణ కలం నుంచి 41 పుస్తకాలు ఆవిష్కరించారన్నారు. సాహిత్య వేదికలను స్థాపించటం, ఏడు ఆడియో గీతాల క్యాసెట్ల ఆవిష్కరణ, ఎన్నో అవార్డులు దక్కించుకున్నారని కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, మహిళా కార్యదర్శి అడ్డగూరి శ్రీలక్ష్మీ, సంతోష్ కవితాగానం చేశారు.

బాసరలో సామూహిక సత్యనారాయణ వ్రతం


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న దంపతులు

బాసర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వ్యాసపురి కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్, యాత్రిక్ నివాస్ ట్రస్ట్ చైర్మన్ మూడ నాగభూషణం గుప్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

ఎంపీ పూజలు


పూజల్లో పాల్గొన్న ఎంపీ వంశీకృష్ణ

దండేపల్లి(మంచిర్యాల): జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామిని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది, అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదం అందజేశారు.

సబ్‌స్టేషన్ గోదాంలో షార్ట్‌సర్క్యూట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో గల జేపీఈ గోడౌన్‌లో ఆదివారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పివేశారు. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ గోడౌన్ ఉండగా పెను ప్రమాదం తప్పింది. దాదాపు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

అ‘పూర్వ’ సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

తాండూర్: మండల కేంద్రంలోని సురభి గోదా క్షేత్ర గార్డెన్స్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. నాడు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో నాటి గురువులు ఎస్.రాంమ్మోహన్‌రావు, ఎం.రాంమ్మోహన్‌రావు, జగన్నాథరావు, సురేందర్, రవి, సుభాంగిణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గూడెంలో భక్తుల రద్దీ


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తికమాసం ప్రారంభం నుంచి భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 584 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. సన్నిధి ద్వారం సమీపంలో గల రావిచెట్టు వద్ద భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా కనిపించాయి.